


శ్రీకృష్ణ జన్మస్థానం!

గుడికీ, జైలుకీ తేడా చాలావుంది. గుడికెళ్ళి గంటకొట్టి వస్తే భక్త డంటాం. జైలుకెళ్ళి తిరిగొస్తే దొంగ వెధవని బిరుదిస్తాం. అంతమాత్రాన జైలుని తీసి పారేస్తే న్యాయం కాదు. జైలుకూ్కడా ఒక చరిత్ర వుంది, ఒక పవిత్రత వుంది. సాక్షాత్తూ కృష్ణ పరమాత్మ జైల్లోనే పుట్టాడు. అందు ఐనా మనం జైలుని గౌరవించాలి. జైళ్ళ హిస్టరీ పరిశీలిస్తే మనకి కొన్ని విలువయిన కథలు దొరుకుతాయి. సిద్ధార్థుడు జీవితంమీద విరక్తి పెంచుకుని చెట్టుకింద చేరి ఒక మతాన్ని సృష్టించేడు. అట్లాగే కొందరు ప్రముఖులు జైళ్ళకెళ్ళి మరువరాని మహనీయులయ్యేరు. ఈ దేశానికి స్వాతంత్ర్యం రాక మునుపు ఆ బాపతు ఆందోళనల పేరిట ఎందరెందరో జైళ్ళ పాలయ్యేరు. తిరిగివచ్చి జాతి నాయకులుగా స్థిరపడ్డారు. ఆ రోజుల్లో లాఠీ దెబ్బలు తినడం,

జైలు కెళ్ళడం ఒక క్వాలిఫికేషను. ఆ తరం నాయకుల్లో ఎవరైనా జైలుకి వెళ్ళలేదని తెలిస్తే అది వాళ్ళకి పెద్ద మచ్చగా వుండేది.

అప్పలనరసయ్యగారని మాకో దూరపు బంధువున్నాడు. ప్రస్తుతం ఆయన వయస్సు ఎనభై. ఆయన చిన్నతనంలో చాలా తడవలు జైలుశిక్ష అనుభవించేడు. పట్టాభి సీతారామయ్యగారితో ఆన్నెల్లా, వల్లభాయ్ పటేల్ గార్తో ఏడాదీ జైల్లో వున్నట్లు చెప్పుకుంటారు. చెంగల్పట్టు జైలులో నెహ్రూగారూ, తానూ ఒకర్నొకరు విడిచి పెట్టకుండా తిరిగేమని గొప్పగా చెబుతారు. ఛోటా నాయకులు సరేసరి. జైలులో తనకి సిగరెట్లవీ అందించే వారనీ మురిసిపోతూ ముచ్చటిస్తారు. కొత్తవాళ్ళు ఇదంతా నిజమేనని నమ్మే ప్రమాదం ఎంతయినా వుంది, మేము నమ్మం. ఎంచేతంటే శ్రీవారి గుణ గణాలు మా పెద్దవారు యిప్పటికీ చెబుతూనే వుంటారు. అప్పలనరసయ్య జైలు కెళ్ళిన మాట వాస్తవమే గాని అది దేశంకోసం కానేకాదుట. ఆ రోజులలో శ్రీవారు కొన్ని చోరీ కేసుల్లో యిరుక్కుని జైలు కెళ్ళేనని చెప్పుకుంటే సిగ్గుచేటని ప్లేటు ఫిరాయిస్తున్నట్టు మా వాళ్ళంటూంటారు.

అత్తవారింటి కెళ్ళిన అల్లుడ్ని నెత్తి నెక్కించుకుంటారు. గౌరవ మర్యాదలు ఘనంగానే జరుగుతాయి. టిఫినూ, కాఫీలూ, వేళకి భోజనం, పడగ్గది, బోలెడు విశ్రాంతి, ఇంచుమించు ఈ ఏర్పాట్లు జైలులో కూడా వుంటాయని తెలుసుకున్నారు. గనకనే, జైలుకి అత్తవారిల్లని ముద్దు పేరు పెట్టేరు. వేళ ప్రకారం గంటలు కొట్టి తిండి పెడతారు. విశ్రాంతి తీసుకో మంటారు. దేశం ఎట్లా అఘోరించినా జైలు మాత్రం చెక్కుచెదరదు. ఎక్కడో చదివేను. జోకో, నిజమో తెలీదు. అదేదో దేశంలో ఖైదీలను అస్తమానం జైల్లో వుంచరుట. కొన్ని గంటలపాటు షికారు కెళ్ళి రమ్మని బయటకు పంపిస్తారుట. ఎక్కడ షికార్లు తిరిగినా, చీకటి పడే వేళకి మళ్ళా జైలుకి వచ్చేయాలి అదీ పద్ధతి. ఎవడో ఖైదీ రోజూ జైలుకి ఆలస్యంగా వస్తుంటే జైలరుకి ఒళ్ళు మండి పోయిందిట. ఇంకో తడవ ఆలస్యంగా వచ్చావో నిన్ను విడుదల చేసి పంపించేస్తానని అల్టిమేటమ్ యిచ్చేట్ట. ఆ మాటకు ఖైదీ ఖంగారు పడిపోయి, బాబ్బాయి అంతపని చేయకండని కాళ్ళట్టు కున్నాడుట. దీనివల్ల ఆ జైలు అక్షరాలా అత్తవారిల్లు అని అర్థమైపోతుచిం.

క్లాస్‌వన్ తిండి, ఏ వన్ సదుపాయాలూ అక్కడి జైళ్ళలో అమర్చిపెట్టేరని తెలిసిపోతుంది. చూస్తూ చూస్తూ ఏ ఖైదీ మాత్రం ఆ సుఖాలను వదులుకుంటాడు?

మన దేశంలోకూడా అల్లాంటి జైళ్ళు ఏర్పాటుచేస్తే జైలు పాలయ్యేందుకు పోటీలు పడతారు. కొట్టుకుచస్తారు. జైలు బయట నానా అవస్థలూ పడి చచ్చేకంటే, జైల్లో కూచుని నిశ్చింతగా బతుకు లాగించేవచ్చు కదా! పెళ్ళాం బిడ్డల్ని కూడా రప్పించుకునే మార్గముంటే - ఎంచక్కా జైల్లోనే ఒక క్వార్టరు తీసుకుని బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా సంసారం పెట్టేసుకోవచ్చు. జైలు జాతి కులస్థులుగా పిలిపించుకోవచ్చు. వాళ్ళ పిల్లల పెళ్ళిళ్ళు కూడా జైలు జాతి వాళ్ళలోనే జరిపించేసి, జైలు ప్రపంచాన్ని సృష్టించవచ్చు. మరో ప్రపంచం పిలిచిందని మహాకవి వాక్యం ఆ ప్రపంచం ఎక్కడుందో అక్కడి పరిస్థితులు ఏమిటో కవిగారికే తెలియాలి. ఈ జైలు ప్రపంచం ఆ మరో ప్రపంచం ముందు ఏమాత్రం తీసిపోదని నాకు గట్టి నమ్మకం

కథలూ, కవిత్వాలూ రాయడానికి మంచి ప్లేసూ, పరిసరం చాలా అవసరమని శాస్త్రజ్ఞులు సెలవిచ్చేరు. ఫైవ్‌స్టార్ హోటల్, ఏసి గది, బేరరు తెచ్చే తెల్లగుర్రాలూ, నల్ల కుక్కలూ అందుకు అనుకూలంగా వుంటే వుండొచ్చు. అయితే అవి అందరికీ అందుబాటులో లేవు. ప్రకృతి మాత దయవల్ల పంట కాలవలూ, పిల్లగాల్లూ వుండనే వున్నాయి. పైసా ఖర్చులేని వ్యవహారం. కాలువ మీదున్న వంతెనెక్కి దస్త్రాలు కొద్దీ రాసేయ వచ్చు. అది ఇది కాదనుకుంటే జైలు బెటరు. జైల్లో రాసిన గ్రంథాలు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి. మహాత్మా గాంధీ, పండిత నెహ్రూ ఆ లెవెల్లో మరికొంతమంది మహనీయులు అనేకానేక గ్రంథాలు జైళ్ళలోనే రాసేరు. ఆ రాతలు ఎంతో కీర్తి గడించేయి. జైలుకి, అక్కడకూచుని రాసే రాతకి ఏదో అవినాభావ సంబంధ ముందని నాకో డవుటు.

జైలులో కూచుని నాలుగైదు నవలలూ, నాటకాలూ రాద్దామని నాకెంతో కోరికగా వుంది. జైలుకి వెళ్ళాలంటే రెండే మార్గాలు. ఎవడి తలో పగలగొట్టిగాని, జేబులు గొట్టిగాని, వెళ్ళడం ఒక మార్గం. ఇందుకు

నా శక్తి చాలదు. పవిత్రమైన రాజకీయాల కారణంగా జైలు పాలవడం రెండో మార్గం. ఇది ఉత్తమం. కాని నాకు అందుబాటులో లేని విద్య అయినా ప్రయత్నిద్దామని ఎమర్జన్సీ రోజులలో కొంచెం చొరవ చేయ బోయాను. అప్పటికే నాకు తెలిసిన కొందర్ని జైళ్ళకి తీసుకు పోయేరు కూడాను. జైళ్ళకు వెళ్ళిన వాళ్ళు ఖండ కావ్యాలు రాయడం ప్రారంభించేరు కూడాను. నన్ను పట్టుకు పొండని పోలీసులకు జాబు రాసి పోస్టు చేయ బోతుండగా ఆ వుత్తరం మిత్రుల చేతులలో పడింది. నీ కిదేం పొయేకాలం అని అడిగేరు. మాస్టర్ పీసు రాయాలంటే జైలొక్కటే అనువైన ప్రదేశ మని జవాబు చెప్పేను. వెళ్ళిన వారంతా అందుకే వెళ్ళారా అని ప్రశ్నిస్తే అవునన్నాను. నా మాటకి మిత్రులు చాలా బాధపడ్డారు. మహోద్యమాన్ని కించపరిస్తే కళ్ళు పీకేస్తా మన్నారు. ఇంకో తడవ జైలు పేరెత్తావంటే డొక్క చింపుతామన్నారు. జైలంటే ఒక నరకం. అక్కడికి వెళ్ళాలంటే దమ్ములుండాలి. ఉద్యమం పేరిట దమ్ములున్న మొనగాళ్ళు జైళ్ళని లెక్క చేయకుండా వెడుతున్నారే గాని, నీ బోడి రాతలు గురించి కాదని మీటింగు పెట్టేరు.

వాళ్ళు ఏమన్నా సరిపెట్టు కున్నాను గాని, జైలుని నరకమంటే ఎందుకో అంగీకరించలేక పోయాను. చూడు నాయనా, ఇంత విశాలమయిన ప్రపంచమే నిజమైన జైలు. అందులో వెలసిన జైలు మందిరాలన్నీ, భూలోక స్వర్గాలు సుమా అంటూ మొన్నీ మధ్యనే జైలు శిక్షనుంచి విడుదలైన, కాషాయ వస్త్రాలు తొడుక్కున్న గంజాయి స్వాములవారు నాతో అన్నారు. వారు వారి భార్యని చంపి, జైలు కెళ్ళేరట. స్వర్గ మంటున్నారు గద స్వామీ మళ్ళా వెళ్ళి పోకూడదా అని ప్రశ్నించేను. వెళ్ళాలనే వుంది నాయనా! ఇంకో భార్య దొరకాలిగదా అన్నాడు స్వామి. భార్య దొరికితే జైలుకి సుళువుగా వెళ్ళవచ్చనే స్వామి ధ్యేయానికి చేతులు జోడించేను.